క్లుప్తంగా

వలంటీర్లకు సన్మానం



వలంటీర్ల సన్మాన కార్యక్రమంలో ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: మండల కేంద్రంలోని సచివాలయంలో పలువురు వలంటీర్లను శుక్రవారం సన్మానించారు. ఇదే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ మాట్లాడుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా అందిస్తున్న వలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. వలంటీర్ల సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం కూడా సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర పురస్కారాలు అందించి, వారిని గౌరవించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కనగల భారతి, ఎంపీటీసీ కనగల పద్మ, వైఎస్సార్ సీపీ నేత కనగల పారినాయుడు పాల్గొన్నారు.

జేసీఎస్ మండల కన్వీనర్‌గా ఉమామహేశ్వరరావు



ఉమామహేశ్వరరావు

వంగర: మండల జేసీఎస్ కన్వీనర్‌గా కిమిడి ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం వైస్ ఎంపీపీగా తనను జేసీఎస్ మండల కన్వీనర్‌గా నియమించడం ఆనందంగా ఉందని, నాపై సీఎం జగన్ ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానని, పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్, ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, జెడ్పీటీసీ కరణం రాధమ్మ తదితరులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేగిడి: మండలంలోని ఉప్పర్నాయుడువలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ రథచక్రం ముగ్గు వేసి, పంటల వివరాలు, సాగు పద్ధతులు, వాటి ఫలితాలను అన్నదాతలకు వివరించారు. కార్యక్రమంలో డీపీఎంవో రేఖ, మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్, యూనిట్ ఇన్‌చార్జ్ పి.రమాదేవి పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు అందజేత



పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ వెంకటేశ్వరరావు

రేగిడి: వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా మండలంలోని ఉనుకూరు సచివాలయం వద్ద వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ గేదెల వెంకటేశ్వరరావు చేతులమీదుగా గర్భిణులకు పౌష్టికాహార కిట్లు శుక్రవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మూడు నెలలు దాటిన గర్భిణులందరికీ వీటిని అందజేస్తున్నామని, వీటితో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. మాతాశిశు మరణాల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, దీనిలో భాగంగానే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యశిబిరం

రేగిడి: మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యశిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి సునీల్‌కుమార్ 52 మంది రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక రోగాలు నయమవుతాయని, ప్రతిఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చురుగ్గా ఉపాధి పనులు

రాజాం: మండలంలోని గడిముడిదాం గ్రామంలో చురుగ్గా జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీవో కె.సాయిరాం శుక్రవారం పరిశీలించారు. నిర్దేశిత కొలతల ప్రకారం పనులు చేస్తే కనీస వేతనం కింద రూ.270 వస్తుందని తెలిపారు. ఉపాధి పనులు పూర్తి స్థాయిలో చేసిన గ్రామాల్లో మెటీరియల్ పనులకు అవకాశం ఉంటుందన్నారు. వేతనదారుల సంఖ్య పెంచాలన్నారు. అనంతరం బొద్దాం, కంచరాం గ్రామాల్లో పనులను కూడా పరిశీలించి, పలు సూచనలు చేశారు.

సేవాభావం అలవర్చుకోవాలి

రేగిడి: ప్రతిఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని సత్యసాయి సేవా సంస్థల రాష్ట్ర ఆధ్యాత్మిక సమన్వయకర్త పడాల ప్రసాదరావు సూచించారు. మండల కేంద్రంలోని విశ్వసాయి మందిరంలో భగవాన్ శ్రీసత్యసాయిబాబా ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు పలు సేవా కార్యక్రమాలు, వాటి ఫలితాలు, నామ సంకీర్తన, నగర సంకీర్తన వంటి అంశాలను వివరించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ప్రశాంతి సేవా ఇన్‌చార్జ్ శ్రీనివాసరావు, భజన మండలి కన్వీనర్ లావేటి విష్ణుమూర్తి, మామిడి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాడు దోపిడీ.. నేడు సంక్షేమం

- సచివాలయాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



రామభద్రపురంలో కొత్తగా నిర్మించిన సచివాలయం-3 భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: నాడు టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీల పేరుతో దోపిడీ పాలన జరిగితే నేడు వైఎస్సార్ సీపీ హయాంలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సంక్షేమ పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన సచివాలయం-3 భవనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రాంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, అన్ని ప్రాంతాలతో పాటు అన్నివర్గాల్లోని ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపన అని అన్నారు. ప్రస్తుతం ఆయన చొరవతోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమాన స్థాయిలో జరుగుతోందన్నారు. గతంలో ఏదైనా ఒక అభివృద్ధి పనికి శంకుస్థాపన జరిగితే మళ్లీ మరో ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే ఆ పని ప్రారంభోత్సవం జరిగేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అలా కాదని, శంకుస్థాపన చేసిన ఏడాదిలోపే ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయన్నారు. గత ప్రభుత్వంలో అవినీతిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అవినీతి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం జరిగిందన్నారు. గ్రామాల్లో సచివాయాలు నిర్మించి, ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు చేరువ చేశారన్నారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా లంచాలకు తావు లేకుండా కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలోనే కాదు.. దేశ చరిత్రలోనూ ఏ పార్టీ, ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేశారన్నారు. మంచి చేశానని భావిస్తేనే రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరిన ఏకైక నాయకుడు మన సీఎం జగనన్న అని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, సర్పంచ్ రవ్వా ఈశ్వరరావు, ఎంపీటీసీలు వసంతుల తిరుపతిరావు, బవిరెడ్డి చంద్రరావు, పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మీనాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయలు, జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం..

బాడంగి: మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా సాధ్యమైందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గూడెపువలస గ్రామంలో రూ.43.60 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాలనలో పారదర్శకత కోసం సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ప్రవేశపెట్టడం జరిగిందని, వీటి ద్వారా ప్రజలకు పక్కాగా రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. ఇదే అభివృద్ధి, సంక్షేమం కావాలంటే రానున్న ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, వైస్ ఎంపీపీ బి.రమేష్, పీఆర్ డీఈఈ అప్పారావు, ఎంపీటీసీ పూడి సింహాచలం, సర్పంచ్ ఎ.గణేశ్వరరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బి.వెంకటనాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు, సచివాలయ కన్వీనర్ పూడి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీతోనే పేదలకు మెరుగైన వైద్యం

- హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే పేదలకు మెరుగైన వైద్యం అందించడం సాధ్యమవుతోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని ఎం.ఆర్ అగ్రహారం గ్రామంలో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాన్ని ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో వైద్య రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని విమర్శించారు. రాష్ట్రంలో ప్రస్తుతం అధికారంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వైద్యరంగానికి అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, ప్రజారోగ్యమే లక్ష్యంగా చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. గతంలో శిథిలావస్థలో ఉన్న పీహెచ్‌సీలను ఇప్పుడు నాడు-నేడు పథకం ద్వారా అధునాతన ఆస్పత్రులుగా మార్చారన్నారు. ప్రతీ పీహెచ్‌సీ, సీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కొరత లేకుండా, ప్రజలకు నిత్యం వైద్యసేవలు అందేలా చూస్తున్న ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల పిల్లలకు వైద్యవిద్యను అభ్యసించేందుకు వీలుగా సీఎం జగనన్న మెడికల్ కళాశాలలను ప్రారంభించారన్నారు. ప్రతీ పేదవానికి మెరుగైన వైద్యం అందించాలన్న ఏకైక ఉద్దేశ్యంతోనే ప్రతీ గ్రామ సచివాలయం పరిధిలో ఓ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, అలాగే ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు అమలు చేయడం జరుగుతోందన్నారు. అందరం బాగుండాలంటే మళ్లీ మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే రావాలని, రానున్న ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని మరలా అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ ప్రతినిధులు నర్సుపల్లి బాబ్జీరావు, గర్బాపు రామారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, పీఆర్ డీఈ అప్పారావు, సీహెచ్‌వో భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి హైమావతి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

బొబ్బిలి: వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సూచించారు. శుక్రవారం స్థానిక పట్టణంలోని ప్రధాన తాగునీటి వనరుల కేంద్రాన్ని ఆమె సందర్శించి, మోటార్లు, పైపుల పనితీరు, క్లోరినేషన్, సిబ్బంది పనితీరు, హాజరును పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇన్‌ఫిల్టరేషన్ బావుల్లో నీటి లభ్యత పెంచేందుకు నదికి అడ్డంగా ఇసుకతో అడ్డుకట్టలు నిర్మించాలని తెలిపారు. ఏఈ సురేష్ పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

రాజాం సిటీ: మండలంలోని ఆగూరు గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో బాసూరి శంకరరావు, ఈవోపీఆర్‌డీ వి.శ్రీనివాసరావు కలిసి శుక్రవారం పరిశీలించారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీ కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పనులు పూర్తి చేయాలని సూచించారు.

'ఉపాధి' పథకానికి కేంద్రం తూట్లు

బొబ్బిలి: ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడిచేలా వ్యవహరిస్తోందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పొట్నూరు శంకరరావు ఆరోపించారు. శుక్రవారం మండలంలోని కోమటిపల్లి గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనుల ప్రదేశానికి వెళ్లి, అక్కడి వేతనదారులతో కలిసి కేంద్రానికి వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ముఖ హాజరులో మార్పులు చేసి, కూలీల సంఖ్యను తగ్గించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని, దీనికి వ్యతిరేకంగా ఈ నెల 26వ తేదీన ఆర్‌డీవో కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రైనీ డీఎస్పీ మహేందర్, రూరల్ సీఐ శ్రీనివాసరావు

రాజాం సిటీ: వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని ట్రైనీ డీఎస్పీ మహేందర్ కోరారు. శుక్రవారం స్థానిక పాలకొండ రోడ్డులోని జీఎంఆర్ ఐటీ జంక్షన్ వద్ద రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావుతో కలిసి వాహన తనిఖీలు చేపట్టిన ఆయన ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని తెలిపారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలి



న్యాయవాదుల సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి బాబు

రాజాం సిటీ: స్థానిక కోర్టు సముదాయంలో మార్చి 9వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయాలని సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులతో శుక్రవారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ కక్షిదారులందరికీ లోక్‌అదాలత్ సేవలపై అవగాహన కల్పించి, వీలైనన్ని ఎక్కువ కేసులను రాజీ చేయించాలన్నారు. రాజీకి అనుకూలమైన సివిల్, క్రిమినల్, ప్రీలిటిగేషన్ కేసులను ఇరుపార్టీల అంగీకారంతో పరిష్కరించనున్నామన్నారు. సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి పి.ఎస్.వి.బి. కృష్ణసాయితేజ, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.రమణమూర్తి, డి.భవానీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరగాలి



మాట్లాడుతున్న ఎస్పీ దీపికా పాటిల్

రామభద్రపురం: జిల్లాలో ప్రశాంతంగా రానున్న సార్వత్రిక ఎన్నికలు జరగాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ దీపికా పాటిల్ సూచించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించిన ఆమె మీడియాతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల దృష్ట్యా ముందస్తుగా సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నామన్నారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలను గుర్తిస్తున్నామన్నారు. అలాగే బైండోవర్ కేసులు కూడా నమోదు చేస్తున్నామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు నాలుగు పోలీస్ చెక్‌పోస్టులు ఉండగా, ఎన్నికల నేపథ్యంలో మరో 11 చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం, గంజాయి, డబ్బులు వంటివి అక్రమ రవాణా జరగకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఓటర్లు ఎటువంటి ఒత్తిళ్లకు భయపడకుండా స్వేచ్ఛగా ఓటు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నామని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరిగినా సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ తిరుమలరావు, ఎస్ఐ జ్ఞానప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ పండగ

రామభద్రపురం: మండల కేంద్రంలో బంగారమ్మ పండగ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సోంపురం, చింతలవలస, బూసాయివలస, ముచ్చర్లవలస, తారాపురం గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఉత్సవంలో పాల్గొని, బంగారమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది పాడిపంటలు బాగా పండాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు కల్పించాలని వేడుకున్నారు. పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం అమ్మవారి ఘటాల తిరువీధి చేపట్టి, రాత్రి అనుపోత్సవం నిర్వహించారు.


మూడోసారి ఆశీల వేలం వాయిదా

రాజాం సిటీ: మున్సిపాలిటీకి సంబంధించి, డైలీ మార్కెట్ ఆశీల వేలంపాట మూడోసారి వాయిదా పడింది. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ జె.రామఅప్పలనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం వేలం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రూ.34.56 లక్షల నుంచి వేలం ప్రారంభం కాగా అదనంగా 18 శాతం జీఎస్టీ ఉంటుందన్నారు. పాటదారులు మాత్రం జీఎస్టీ లేకుండా వేలం నిర్వహించాలని భీష్మించుకు కూర్చున్నారు. ఇప్పటికే మార్కెట్‌లో వసూళ్లు కష్టంగా ఉన్నాయని, దీనిపై పునరాలోచన చేయాలని అభ్యర్థించారు. ఏడాదికి సంబంధించి, ఇంత మొత్తంలో వేలం పాడితే నష్టపోతున్నామని, జీఎస్టీ అయినా కనీసం తగ్గించాలి లేదంటే అసలులో అయినా కొంత తగ్గించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. స్పందించిన మున్సిపల్ కమిషనర్ నిబంధనల మేరకు వేలం నిర్వహిస్తున్నామని, పాటదారులంతా వేలం పాట పాడేందుకు ముందుకురావాలన్నారు. అయినా పాటదారులు ఆసక్తి కనబరచకపోవడంతో ఈ నెల 26వ తేదీ నాటికి వాయిదా వేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ ఎంవీ నాగరాజు, ఆర్ఐ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ఆందోళన

బాడంగి: బకాయి జీతాలు చెల్లించాలని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయమై సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించి, ఆందోళన చేపట్టారు. కొన్ని నెలలుగా జీతాలు అందివ్వకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే జీతాలు చెల్లించేలా చూడాలని కోరారు.

అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలి



విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న ఎంఈవో ఎరకయ్య

రేగిడి: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంపొందించాలని ఎంఈవో బి.ఎరకయ్య సూచించారు. మండలంలోని సంకిలి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన వివిధ ప్రశ్నల ద్వారా అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేయాలని, జగనన్న గోరుముద్ద పథకం సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



కొత్తవలస గ్రామస్తులతో పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్

- వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని కొత్తవలస గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన అక్కడి వైఎస్సార్ సీపీ నేతలు, పలు సంఘాల నాయకులను కలిసి, తనకు మద్దతు తెలపాలని కోరారు. అనంతరం ఈ నాలుగున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు చేసిన మేలును వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాటుపడుతున్నారని, అలాగే అన్ని వర్గాల్లోని ప్రజల బాగోగుల కోసం నిరంతరం ఆయన శ్రమిస్తున్నారన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాల ప్రజలకు లబ్ధి చేకూరేలా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం అమలులోని పథకాలతో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీనే మళ్లీ గెలిపించి, సీఎం జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. తనకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారని, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ప్రజలకు మరింత చేరువై, సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, జేసీఎస్ కన్వీనర్ కొయ్యాన సత్యంనాయుడు, బగ్గు హరినాథరావు, ఉంగటి గోవింద్, వాన అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి



విద్యార్థితో మాట్లాడుతున్న డీఈవో ప్రేమ్‌కుమార్

రాజాం: పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలని డీఈవో ప్రేమ్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన పదోతరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షల నిర్వహణపై ఆరాతీశారు. అనంతరం 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తున్న ఎఫ్ఏ-4 పరీక్షలపై వివరాలు సేకరించారు. ఈ ఏడాది 227 మంది పదో తరగతి పరీక్షలు రాయనుండగా, వారంతా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు జీఎంఆర్ఐటీలో జరుగనున్న టెట్ పరీక్షలకు సంబంధించి, పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు.

క్షయవ్యాధి నియంత్రణకు చర్యలు



రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారిణి రాణి

వంగర: క్షయవ్యాధి నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా క్షయ నివారణ అధికారిణి కె.రాణి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె ల్యాబ్ టెక్నీషియన్ గది, మందుల గదిని పరిశీలించారు. రోగుల ఆరోగ్య తనిఖీల రికార్డులు, మందులు పంపిణీ వివరాలు పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో ల్యాబ్ టెక్నీషియన్ దమయంతి, ఫార్మాసిస్ట్ సురేష్‌లను అభినందించారు. అనంతరం కొప్పరవలస, మగ్గూరు గ్రామాల్లో పర్యటించి, రోగులతో మాట్లాడి, వారికి అందిస్తున్న వైద్యసేవలు, మందుల పంపిణీపై ఆరాతీశారు. అనంతరం సిబ్బందితో మాట్లాడి.. జిల్లా వ్యాప్తంగా క్షయ వ్యాధి నియంత్రణకు ప్రత్యేక వ్యాక్సిన్‌ను త్వరలోనే అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ జె.ఎస్.వి.శ్రీనివాస్, వైద్యాధికారిణి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



సంతకవిటి: రోగులకు మందుల కిట్ అందజేస్తున్న వైద్య సిబ్బంది, అధికారులు



వంగర: మగ్గూరులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది



బాడంగి: కోడూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ రామారావు, ఎంపీపీ గౌరి, సర్పంచ్ జ్యోతి

ప్రజారోగ్యమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామగ్రామాన నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం పలు గ్రామాల్లో నిర్వహించిన వైద్య శిబిరాలకు హాజరైన రోగులకు వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, ఉచితంగా మందులు అందజేశారు. మెరుగైన వైద్యం, శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రులకు రిఫర్ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఉన్న ఊరిలోనే నాణ్యమైన వైద్యం అందుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రాజాం సిటీ: డీఆర్‌ఎన్ వలసలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎంపీడీవో శంకరరావు

–సాక్షి నెట్‌వర్క్.